# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

Digital, tmedia.net.in

11వ వార్షికోత్సవం ★ 2016 - 2026 ★ మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!

సంపుటి : 160
సంచిక : 280
పేజీలు : 3

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

మంగళవారం, జూన్ 23, 2026


## లారీపై కూలిన భారీ వృక్షం..



**టిమీడియా, జూన్22,ఏన్కూరు** :మండల పరిధిలోని ఏన్కూరు నుంచి కొత్తగూడెం వెళ్లే ప్రధాన రహదారిపై సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కురిసిన భారీ వర్షం, ఈదురుగాలుల కారణంగా ఐదు భారీ వృక్షాలు నేలకొరిగాయి. దీంతో రహదారిపై వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి సుమారు మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఓ లారీపై ఒక్కసారిగా భారీ చెట్టు కూలి పడింది. అయితే అదృష్టవశాత్తూ డ్రైవర్‌తో పాటు లారీలో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. లారీకి స్వల్ప నష్టం జరిగినట్లు తెలిసింది.

# సమన్వయంతో
# సీఎం సభ విజయవంతం

## -డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు





### - క్షేత్రస్థాయిలో పరిశీలన, సమీక్షా

**టి మీడియా, జూన్ 22, చింతకాని:** ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలంలో జూన్ 30న నిర్వహించనున్న సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లను సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీసు కమిషనర్ సునీల్ దత్, వివిధ శాఖల అధికారులతో కలిసి సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు, ప్రజల రాకపోకలకు అనువైన మార్గాలు, భద్రతా ఏర్పాట్లకు సంబంధించిన ప్రాంతాలను సందర్శించి సమగ్రంగా పరిశీలించారు.

అనంతరం జగనాధపురం ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలను మరింత చేరువ చేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయడం ప్రతి శాఖ బాధ్యత అని అన్నారు. సభకు భారీ సంఖ్యలో రైతులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లను ముందస్తుగా

3లో



## భద్రాచలంలో అవమానవీయ ఘటన

### - మృతదేహాలను అద్దె ఇంట్లోకి తేవొద్దని తాళం

**టీ మీడియా ,జూన్ 22 , భద్రాచలం :** ఇరుగు పొరుగున ఉన్న వారు మరణిస్తే అయ్యో అని బాధపడతాం. ఇంట్లో వారు మరణిస్తే బాధను దిగమింగుకుని అంతిమ కార్యక్రమాలు నిర్వహిస్తాం. అలాంటిది నిన్నా మొన్నటి వరకూ మనతో ఆప్యాయంగా పలకరించే వారికి ఏమైనా జరిగితే సాయం చేయడానికి ముందుంటాం. అయితే భద్రాచలం పట్టణంలోని జరిగిన ఘటన అందుకు విరుద్ధంగా జరగడంతో చర్చనీయాంశంగా మారింది.భద్రాచలం పట్టణంలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. అయితే మరణించిన ముగ్గురి మృతదేహాలను అద్దె ఇంటికి తీసుకురాకూడదనే ఉద్దేశంతో యజమాని తాళం వేశారు.స్థానికులు

3లో



## వ్యభిచార గృహం వద్ద వివాదం

### గ్రామ పెద్దలపై కత్తితో దాడి

**టి మీడియా, జూన్ 22,సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలంలో ఆదివారం అర్ధరాత్రి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వ్యభిచార గృహం నిర్వహణపై గ్రామ పెద్దలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో జరిగిన వివాదం కత్తిపోట్లకు దారి తీసి ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన కలకలం రేపింది.బంధువులు, పోలీసుల వివరాల ప్రకారం.. సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామ శివారులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరువూరు మండలానికి చెందిన నాగమణి, హనుమంతరావు దంపతులు ఓ ఇంటిలో వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్లు స్థానికులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో కిష్టారం ఎస్సీ కాలనీకి చెందిన గ్రామ పెద్దలు మారోజు నాగేశ్వరరావు, నక్క వెంకటేశ్వరరావు ఆదివారం అర్ధరాత్రి అక్కడికి వెళ్లి గ్రామ సమీపంలో ఇలాంటి కార్యకలాపాలు నిర్వహించడం సరైంది కాదని, వెంటనే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసి వెళ్లిపోవాలని హెచ్చరించినట్లు తెలుస్తోంది.ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. వాగ్వాదం కాస్తా ఘర్షణగా మారడంతో నాగమణి, హనుమంతరావు దంపతులు కొబ్బరి బొండాలు నరికేందుకు ఉపయోగించే కత్తితో గ్రామ పెద్దలపై దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ దాడిలో

2లో

# సమన్వయంతో పనిచేయాలి

### అప్పుడే సమస్యలు పరిష్కారం

### అధికారులకు జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశం

**టీ మీడియా, జూన్ 22, పాల్వంచ:** ప్రజల సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వినతులకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.సోమవారం ఐ డి ఓ సి కార్యాలయం లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ విద్యచందన తో కలిసి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న వ్యక్తిగత, సామూహిక సమస్యలను శ్రద్ధగా విని, ప్రతి వినతిపత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిగణించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయం ద్వారా సమస్యల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. వెంటనే పరిష్కరించగల అంశాలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, మిగిలిన సమస్యలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం లేదా జాప్యం చోటుచేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.ప్రతి సమస్య వెనుక ఉన్న మూల కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజా సేవలో పారదర్శకత, జవాబుదారీతనం అత్యంత అవసరమని కలెక్టర్ అన్నారు . ప్రజలు తమ వినతులతో పాటు అవసరమైన ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని తెలిపారు.ప్రజావాణిలో అందిన పలు వినతులను పరిశీలించిన కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు తగు చర్యల నిమిత్తం ఎండార్స్ చేశారు.



**ప్రజావాణిలో వచ్చిన కొన్ని దరఖాస్తు**

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధికి చెందిన వేపల లక్ష్మి తాను ఇంజినీరింగ్ పూర్తి చేశానని, భర్త అనారోగ్యంతో బాధపడుతుండటంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, ఇద్దరు పిల్లల సంరక్షణ బాధ్యత తనపై ఉందని పేర్కొంటూ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ పోస్టు కల్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ ఉపాధి కల్పన అధికారికి తగు చర్యల నిమిత్తం ఎండార్స్ చేశారు.కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధికి చెందిన షేక్ సఫియా తాము నివాసం ఉంటున్న ఇల్లు శిథిలావస్థకు చేరుకుందని, వర్షాకాలంలో వర్షపు నీరు ఇంట్లోకి చేరుతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ పథకం కింద ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌కు తగు చర్యల నిమిత్తం ఎండార్స్ చేశారు.దమ్మపేట మండలం మల్లారం మోడల్ కాలనీకి చెందిన మోదంపరుపు సత్యవతి తాము నిరుపేద కుటుంబానికి చెందినవారమని, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, తమకు ఇందిరమ్మ గృహం మంజూరు చేయాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఎండార్స్ చేశారు.టేకులపల్లి మండలం రామచంద్రునిపేట గ్రామపంచాయతీకి చెందిన గ్రామస్తులు తమ గ్రామ పరిధిలోని చెరువులు, వాగుల్లో చేపల వేట ద్వారా జీవనోపాధి పొందుతున్నామని తెలిపారు. గతంలో గిరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉమ్మడి గ్రామపంచాయతీ పేరుతో కొనసాగిందని, నూతన గ్రామపంచాయతీల ఏర్పాటు నేపథ్యంలో రామచంద్రునిపేట గ్రామపంచాయతీ ఏర్పడినందున ఆ గ్రామపంచాయతీ పేరుతో కొత్త మత్స్య సహకార సంఘం ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి మంజూరు

3లో




## ఏజెన్సీ విద్య పై సమీక్ష జరుపండి

**- కొర్స నర్సింహా మూర్తి**

**టీ మీడియా, జూన్ 22, ములుగు బ్యూరో :**ములుగు జిల్లా ఏటూరునాగారం సోమవారం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి లెనిన్ వత్సల్ టోప్పోను కలిసి ఏజెన్సీ విద్యలోని లోపాలపై, సమస్యల పై సమగ్ర మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లోపభూయిష్ట విధానాల కారణంగా ఏజెన్సీ విద్య ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోందని అన్నారు.ఏకోపాధ్యాయ బడులు బాలకార్మిక కేంద్రాలుగా ఐటీడీ ఏ పరిధిలోని 194 గిరిజన ఆశ్రమ, ప్రాథమిక పాఠశాలల్లో 89 పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలేనని నర్సింహా మూర్తి తెలిపారు. "ఒక్క టీచర్ మీటింగ్‌కు వెళ్తే ఆ రోజు పాఠశాల మూతపడుతోంది. నెలలో 6 నుండి 8 రోజులు బడి నడవని పరిస్థితి. ఇవి బాలకార్మికులను తయారు చేసే ప్రభుత్వ కేంద్రాలుగా మారాయి" అని ఆయన ఆరోపించారు.

**14 ఏళ్లుగా నియామకాలు లేవు**

2012 తర్వాత ఐటీడీఏ పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామకాలు జరగలేదని, ప్రస్తుతం 417 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. "సబ్జెక్ట్ టీచర్లు లేకపోవడంతో 8, 9, 10 తరగతుల్లో సైన్స్, మ్యాథ్స్, ఇంగ్లీష్ బోధన అసలే జరగడం లేదు. వెంటనే కాంట్రాక్ట్/సీఆర్టీ విధానంలో పోస్టులు భర్తీ చేయాలి" అని డిమాండ్ చేశారు.

**అంతా అక్షరాస్యులే**

**80 శాతం రక్త హీనత**

ఐటీడీ ఏ పరిధిలో సుమారు 80 శాతం మంది విద్యార్థులు తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్నారని, సరైన పోషకాహారం అందక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. "వీరికి వారానికి 3 సార్లు గుడ్డు, 2 సార్లు చికెన్, రోజూ రాగిజావ, ఆకుకూరలతో కూడిన ప్రత్యేక మెనూ అమలు చేయాలి" అని కోరారు.



## కారేపల్లిలో చోరీ కలకలం

**ఐదు తులాల బంగారం అపహరణ**

**పోలీసుల దర్యాప్తు ప్రారంభం**

**టీ మీడియా,జూన్22,సింగరేణి(కారేపల్లి):** ఖమ్మం జిల్లా సింగరేణి మండల కేంద్రం కారేపల్లిలో ఆదివారం అర్ధరాత్రి చోరీ ఘటన చోటుచేసుకుంది.స్థానికంగా నివాసం ఉంటున్న కేతిమళ్ళ సారయ్య ఇంట్లోకి గుర్తు తెలియని దుండగులు చొరబడి సుమారు ఐదు తులాల బంగారు ఆభరణాలను అపహరించారు.కుటుంబ సభ్యులు ఇంటి బయట నిద్రిస్తున్న సమయంలో,ఇంటి వెనుక తలుపు సరిగా వేయకపోవడాన్ని ఆసరాగా చేసుకున్న దొంగలు లోపలికి ప్రవేశించారు.బీరువా తాళం చెవి అందుబాటులో ఉండటంతో దానిని తెరిచి,లాకర్ తాళం తీసుకుని అందులో ఉన్న ఉంగరాలు,చెవికమ్మలు,చిన్న గొలుసులు తదితర బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు.సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండటం,వస్తువులు చెల్లాచెదురుగా పడివుండటంతో చోరీ జరిగినట్లు గుర్తించారు.వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.దుండగులను గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.ఈ ఘటనతో కారేపల్లి ప్రాంతంలో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## వ్యభిచార గృహం వద్ద వివాదం

మారోజు నాగేశ్వరరావు, నక్క వెంకటేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి.సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించగా ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.ఘటన అనంతరం వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నాగమణి, హనుమంతరావు దంపతులు పరారైనట్లు తెలుస్తోంది. అయితే కొత్తగూడెంకు చెందిన సోని అనే మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.ఈ ఘటనపై వియం బంజర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ సంఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారగా, గ్రామ పరిసరాల్లో అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

# సీఐటీయు పోరాటాలతోనే సంక్షేమ బోర్డు






**- నున్నా నాగేశ్వరరావు**

**మేస్త్రీ వీరయ్యకు ఘన నివాళి**

**టీ మీడియా,జూన్22,సింగరేణి(కారేపల్లి):**కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను నిర్వీర్యం చేసే విధానాలను అమలు చేస్తున్నాయని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు.సోమవారం విశ్వనాథపల్లిలో భవన నిర్మాణ కార్మిక సంఘం(సీఐటీయు)సింగరేణి మండల గౌరవ అధ్యక్షుడు దివంగత చిత్తలూరి వీరయ్య సంస్మరణ సభ శనగ రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ,సరళీకరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని,దీంతో కార్మికుల హక్కులు దెబ్బతింటున్నాయని అన్నారు.ఎనిమిది గంటల పని విధానాన్ని క్రమంగా 12 గంటలకు పెంచే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.సీఐటీయు పోరాటాల ఫలితంగా ఏర్పడిన కార్మిక సంక్షేమ బోర్డులను బలహీనపరిచే కుట్ర జరుగుతోందని,కార్మికుల సంక్షేమానికి వినియోగించాల్సిన నిధులను ఇతర రంగాలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు.భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముదాం శ్రీను,వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ,వీరయ్య మేస్త్రీ నిత్యం వందలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించడమే కాకుండా వారి సంక్షేమాన్ని తన బాధ్యతగా భావించేవారని కొనియాడారు.నిర్మాణ రంగంలో తన నైపుణ్యం,క్రమశిక్షణ,రాజీలేని స్వభావంతో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయికి ఎదిగారని తెలిపారు.కార్మిక సంక్షేమ బోర్డు సాధన కోసం జరిగిన ఉద్యమాల్లో ఆయన పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు.సభకు ముందు కారేపల్లి క్రాస్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన వీరయ్య మేస్త్రీ స్తూపాన్ని ముదాం శ్రీను ఆవిష్కరించగా,సీఐటీయు జెండాను మండల అధ్యక్షుడు కేలోత్ రవి ఎగురవేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర, హమాలీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ముక్కా సీతారాములు,గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే హుస్సేన్,ఉపసర్పంచ్ బొమ్మల ధనమ్మ,మీరెల్లి వెంకటేశ్వర్లు,పగడాల మంజుల,అడ్డగోడ ఐలయ్య, తిరుమలరావు,హుస్మకొండ రమేష్,తురక నారాయణ, రేగళ్ల మంగయ్య,వల్లభినేని మురళి,వడ్డె అజయ్‌బాబు,తలారి దేవప్రకాష్,కరకపల్లి రాయమల్లు,పాసిన్ని నాగేశ్వరరావు,భాగం వెంకటప్పారావు తదితరులు పాల్గొన్నారు.



## యూరియా యాప్ ను రద్దు చేయాలి

**టీమీడియా, జూన్22,ఏన్కూరు :**

ప్రభుత్వం తీసుకవచ్చిన యూరియా యాప్ ను వెంటనే రద్దు చేయాలనీ , సీపీఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్ కోరారు. దీనిపై రైతులకు అవగాహన లేదు . ఎలా బుక్ చేయాలో తెలియడం లేదన్నారు. సర్వర్ కూడా పని చేయడం లేదని ఈ యాప్ వాళ్ళ రైతులకు ఎలాంటి ఉపయోగం లేదని, పాత పద్ధతిలో కొనసాగించాలన్నారు. పెంచిన పెట్రోల్ డీజిల్ ఎరువుల ధరలు తగ్గించాలని, రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని, రైతు బీమా పథకాన్ని అమలు చేయాలని కోరారు. వర్షా భావ పరిస్థితులకు అనుగుణంగా,ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలి.వాటికి బోనస్ ప్రకటించాలని తదితర డిమాండ్స్ పై స్థానిక తహసీల్దార్ కి సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు.దీనిలో రైతు సంఘం మండల అధ్యక్షులు తాళ్లూరి రమణ, మండల నాయకులు మదినేని రమేష్, నరేష్, రామకృష్ణ, బసవయ్య, వేంకటేశ్వర్లు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## పంటల బీమా పథకాన్ని ఏర్పాటు చేయండి

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవి**

**టీమీడియా, జూన్22,మధిర :**ప్రకృతి వైపరీత్యాలతో రైతులకు పంట నష్టం జరిగి తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నారు.రైతులను ఆదుకునేందుకు పంటల బీమా పథకాన్ని ఏర్పాటు చేసి తక్షణమే అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రైతు సంఘం నాయకులు బెజవాడ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నాడు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మధిర మండల సమితి ఆధ్వర్యంలో మధిర తాసిల్దార్ కార్యాలయం ముందు జరిగిన ధర్నాలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అనంతరం తాసిల్దార్ కి వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీజిల్, పెట్రోల్, ఎరువుల ధరలు పెంచి రైతులు ప్రజలపై తీవ్రమైన భారం మోపిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు రైతులు, ప్రజలు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. రెండు లక్షల పైనున్న పంట రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాఫీ మాట మర్చిపోయి ప్రచార పథకాలతో కాలం గడిపేస్తున్నారని వారు ఆరోపించారు. తక్షణమే రెండు లక్షల పైనున్న పంట రుణాలను మాఫీ చేసి రైతు భరోసా, పంట పెట్టుబడి సహాయం మొత్తం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాల వ్యాపారస్తులను కఠినంగా శిక్షించి నాణ్యమైన విత్తనాలు ఎరువులు రైతులకు అందించాలని బెజవాడ రవి గారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం ఖమ్మం జిల్లా నాయకులు యం ఏ రహీం గారు, రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు పంగా శేషగిరి గారు, నాయకులు ఊట్ల కొండలరావు, పెరుమాళ్ళపల్లి ప్రకాశరావు, రామానుజం, శ్రీను, కృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

**-ఎ యస్ పి. హేమంత్ .**

**.టీ.మీడియా,జూన్22 చింతూరు:**

మహిళలపై జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, మొబైల్లో వచ్చే మెసేజ్ మోసాల పట్ల, అప్రమత్తంగా ఉండాలని ఎ యస్ పి హేమంత్ పేర్కొన్నారు. మహిళల భద్రత గూర్చి అవగాహన సదస్సును చిడుమూరు గ్రామం లో నిర్వహించారు.పోలీసువున్నతాధికారులైన జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ గ్రామాన పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ మేరకు సోమవారం చీడుమూరు గ్రామస్తులకు అవగాహన కల్పించారు.మొబైల్ వాడకం పెరిగిన ప్రతి మోసాలు పెరుగుతున్నాయని మహిళలు, యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు.అనేక రకాలుగా మోసాలు జరుగుతున్నాయని వారిపట్ల అప్రమత్తమై పోలీసులకు 112, శక్తి యాప్ ద్వారా వెంటనే సమాచారం ఇచ్చి తమను తాము రక్షించుకోవాలని వివరించారు. అపరిచిత



వ్యక్తులు, అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు తమ గ్రామాలకు వస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.అలాగే రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తామని యువత, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో యస్ ఐ సంతోష్ కుమార్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విత్తన మేళా ను వినియోగించుకోండి

**టీ మీడియా ,జూన్ 22 ,కూసుమంచి:**విత్తన మేళ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సన్న రకం వరి విత్తనాలు తో పాటు వివిధ పంటలకు సంబంధించిన విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు, రైతులు ఈ విత్తనమేళ ను సద్వినియోగం చేసుకోవాలని కూసుమంచి మండల వ్యవసాయ శాఖ కోరింది. ఈ విత్తనములు రైతు వేదికలో మంగళవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయి. దీంతో రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనములు ఒకే చోట కొనుగోలు చేసేందుకు అవకాశం కలిగినట్లు అయ్యింది. విత్తనములతోపాటు నా నో ఎరువులు అందుబాటులో ఉంటాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయ అభివృద్ధి సాధించాలని కుసుమంచి మండల వ్యవసాయ అధికారిని కోరారు.

## దమ్మపేట లో బిఆర్ఎస్ పార్టీకి షాక్

**-రాజీనామా చేసిన పైడి , దోడాకుల**



**టీ మీడియా, జూన్ 22,దమ్మపేట:**అశ్వరావుపేట నియోజకవర్గం లో బి ఆర్ ఎస్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. బి ఆర్ ఎస్ పార్టీలో కీలక నేతలుగా ఉన్న దమ్మపేట మండలానికి చెందిన మాజీ జడ్పిటిసి పైడి వెంకటేశ్వరరావు, దొడ్డకుల రాజేశ్వరరావు సోమవారం బి ఆర్ ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. వారిద్దరూ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు దమ్మపేట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డ రమేష్ కు రాజీనామా పత్రాన్ని సమర్పించారు. పైడి వెంకటేశ్వరరావు, దొడ్డాకుల రాజేశ్వరరావు లు దమ్మపేట మండలంలో బలమైన నాయకులుగా ఉన్నారు.మండల క్రియాశీలక రాజకీయాల్లో పైడి వెంకటేశ్వరరావు తనదైన ముద్ర వేసుకున్నారు. గత 40 సంవత్సరాలు కాలంలో పైడి వెంకటేశ్వరరావు పార్టీ పరంగా ప్రభుత్వ పరంగా, పదవులు ద్వారా దమ్మపేట మండల ప్రజలకు దగ్గరగా ఉన్నారు. అలాగే దొడ్డాకుల రాజేశ్వరరావు కూడా దమ్మపేట మండలంలో బలమైన నాయకుడుగా గుర్తింపు పొందారు. ఇకపై తుమ్మల అడుగుజాడల్లో నడుస్తామనీ, బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన పైడి వెంకటేశ్వరరావు, దొడ్డకుల రాజేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

## భద్రాచలంలో

తెలిపిన వివరాల ఆధారంగా, భద్రాచలంలోని వెంకటేశ్వరకాలనీకి చెందిన దూడల సాయిప్రకాశ్? (25), సంధ్య (22) దంపతులకు ఇద్దరు కుమారులు రుత్విక్ (7), మోక్షిత్? (2) ఉన్నారు. సాయిప్రకాశ్? తండ్రి శ్రీనివాస్? విద్యుత్?శాఖలో లైన్? ఇన్?స్పెక్టర్?గా విధులు నిర్వహిస్తూ ఆరు నెలల కిందట గుండెపోటుతో మృతిచెందారు.

**తిరుగు ప్రయాణంలో చెట్టును ఢీకొని**

ఇటీవల వారి బంధువులు హైదరాబాద్ నుంచి ములకలపల్లి గ్రామానికి వచ్చారు. వారు సాయిప్రకాశ్ కుటుంబాన్ని నిద్ర చేసేందుకు పిలిచారు. అందుకోసం సాయిప్రకాశ్ తన భార్య, చిన్న కుమారుడు మోక్షిత్, తల్లి జ్యోతిలతో కలిసి ములకలపల్లికి కారులో వెళ్లారు. అయితే ఆదివారం తిరిగి భద్రాచలం వస్తుండగా కారు అదుపుతప్పి మాధారం అటవీ ప్రాంతంలోని చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోక్షిత్, సంధ్య, సాయిప్రకాశ్? అక్కడికక్కడే మరణించారు. ఈ ఘటనలో తల్లి జ్యోతికు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు గమనించి ఆమెను పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతున్నారు.

ఇంటికి తాళం వేసి ఉండటంతో

కాగా మృతదేహాలకు పాల్వంచలో పోస్టుమార్టం అనంతరం సోమవారం భద్రాచలంలో వారు నివాసం ఉంటున్న అద్దింటింకి బంధువులు తీసుకొచ్చారు. అయితే ఇంటికి తాళం వేసి ఉండటాన్ని స్థానికులు గమనించి యజమానికి ఫోన్? చేశారు. ఇంట్లోకి మృతదేహాలను తీసుకొచ్చేందుకు ఆయన అంగీకరించలేదు. దీంతో బంధువులు అదే అంబులెన్స్‌లో అంత్యక్రియల కోసం పురుషోత్తపట్నం తీసుకెళ్లారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆరు నెలల వ్యవధిలో మృతిచెందడం అరిష్టమని ఇంట్లో అద్దెకు ఎవరూ రారనే కారణంతో యజమాని ఈ విధంగా వ్యవహరించడం సరికాదని బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సమన్వయంతో పనిచేయాలి

చేయాలని కోరారు. ఈ వినతిని పరిశీలించిన కలెక్టర్ జిల్లా మత్స్యశాఖ అధికారికి తగు చర్యల నిమిత్తం ఎండార్స్ చేశారు.పాల్వంచలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాలలో పార్ట్‌టైమ్ తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న విజయనిర్మల, పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఆరుగురు విద్యార్థులు తెలుగు సబ్జెక్టులో ఉత్తీర్ణత సాధించలేదనే కారణంతో తనను విధుల నుండి తొలగించారని పేర్కొన్నారు. జిల్లాలోని ఇతర పాఠశాలల్లో ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయులను తొలగించలేదని, తనకు న్యాయం చేసి తిరిగి విధుల్లో కొనసాగేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత ఆర్‌సీఓకు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణి మండల నూతన ఎంపీడీవోగా బీ. పద్మ బాధ్యతల స్వీకరణ

**సర్పంచ్‌ల ఘన సన్మానం**

**శుభాకాంక్షలు వెల్లువ**

**టీ మీడియా,జూన్22,సింగరేణి(కారేపల్లి):** సింగరేణి మండల పరిషత్ నూతన ఎంపీడీవోగా బీ.పద్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలో ఎంపీవోగా విధులు నిర్వహించిన ఆమె పదోన్నతిపై సింగరేణి మండల ఎంపీడీవోగా నియమితులయ్యారు.గతంలో సింగరేణి మండల ఎంపీడీవోగా పనిచేసిన పీ.శ్రీనివాసరావు ఖమ్మం డిప్యూటీ సీఈవోగా బదిలీ కావడంతో,అప్పటి నుంచి ఇంచార్జీ ఎంపీడీవోగా మల్లెల రవీంద్ర ప్రసాద్ విధులు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా ఆయన నూతన ఎంపీడీవో బీ.పద్మకు అధికారికంగా బాధ్యతలు అప్పగించారు.అనంతరం మండలంలోని సర్పంచ్‌లు నూతన ఎంపీడీవోను కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.మండల అభివృద్ధికి అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్,సర్పంచ్‌లు దండు ప్రవీణ్,ఈసం మోతీరస్వామి,కల్తి భద్రయ్య ,మాలోత్ స్వామి,రమేష్,ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ మల్లెల రమేష్,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.ఏన్కూరులో గాలివాన బీభత్సం.



టిమీడియా, జూన్22,ఏన్కూరు :ఏన్కూరు మండలంలో సోమవారం గాలివాన బీభత్సం సృష్టించింది. భారీ ఈదురు గాలులు, వర్షం మూలంగా రేపల్లె వాడ, బి ఎన్ తండా, ఇమాంనగర్ గ్రామాలలో పెద్ద పెద్ద వృక్షాలు నేలకూలాయి. ప్రధాన రోడ్డు పై వృక్షాలు పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇదే గ్రామాలలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి.ఇమాంనగర్‌లో ఇంటి దగ్గర ఉన్న కారు పై విద్యుత్ స్తంభం పడిపోయింది. 25 విద్యుత్ స్తంభాలు, 4 ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. విద్యుత్ తీగలు తెగిపోయాయి. సుమారు పది లక్షల రూపాయల నష్టం సంభవించినట్లు అంచనా.

# బాధలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం సామాజిక బాధ్యత

**ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తరఫున**

**బానోత్ బద్రి కుటుంబానికి పరామర్శ**

**50 కిలోల బియ్యం అందజేత**

**టీ మీడియా,జూన్22, సింగరేణి (కారేపల్లి):** గుంపెల్లగూడెం గ్రామానికి చెందిన బానోత్ బద్రి అనారోగ్యంతో మృతి చెందడం పట్ల వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సూచనల మేరకు ఆయన అనుచరులు,పార్టీ నాయకులు బద్రి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.దశదిన కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే తరఫున కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యం సంచులను అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములై వారికి భరోసా కల్పించడమే తమ నాయకుడు రాందాస్ నాయక్ ఆశయమని తెలిపారు.గ్రామ పెద్దలు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే రాందాస్ నాయక్ నిరంతరం కృషి చేస్తున్నారని,అదే విధంగా ఆయన అనుచరులు కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు దారావత్ వినోద్ నాయక్,గుంపెల్లగూడెం గ్రామ శాఖ అధ్యక్షుడు భూక్యా సైదులు,బానోత్ కిషన్,వార్డు సభ్యులు ధరవాత్ భాస్కర్,భూక్యా వీరన్న,బానోత్ వీరన్న,



ఎర్రబెల్లి రాము,బానోత్ రంజిత్,భూక్యా బాబురావు,వంకుడోత్ వసరం,భూక్యా రాందాస్,తులిస్య,మండల యువ నాయకుడు బానోత్ అశోక్,మాజీ దిశా కమిటీ సభ్యుడు లాకావత్ లక్ష్మణ్, గ్రామ పెద్దలు,యువకులు, కుటుంబ సభ్యులు పాల్గొని బానోత్ బద్రి చిత్రపటానికి నివాళులర్పించారు.

# నానో యూరియాతో అధిక ఉపయోగం

**ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి**

**టిమీడియా, జూన్22,కురవి:**యూరియా పంపిణీ విధానాన్ని పరిశీలించిన ఆత్మ చైర్మన్ రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి నానో యూరియా కు అలవాటుపడితేనే అధిక ఉపయోగం ఉంటుందని ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు . మండల కేంద్రంలోని సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు యాప్ ద్వారా యూరియా పంపిణీ విధానాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతూ యాప్ ఉపయోగించడంలో రైతులకు మొదట్లో కొంత ఇబ్బంది ఉన్న తర్వాత యూరియా కోసం పడిగాపులు కాసే విధానం ఉండదని అవసరమైన ప్రతి రైతుకు యూరియా ఏలాంటి ఇబ్బంది లేకుండా అందుతుందని అన్నారు యూరియా వాడకాన్ని క్రమంగా తగ్గించి నానో యూరియా కు అలవాటు పడాలని దానితో రైతులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉపయోగం ఉంటుందని అన్నారు.ప్రభుత్వం సూచించిన ఆరు రకాల వరి సన్నాలను మాత్రమే రైతాంగం వేయాలని వాటికి మాత్రమే బోనస్ అందడమే కాకుండ ఇబ్బంది లేకుండా అమ్ముకోవచ్చని, మంగళవారం నుండి రైతు వేదికలలో విత్తనాలు రైతాంగానికి అందుబాటులో ఉండి పారదర్శకంగా పంపిణీ



జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాకయ్య,ఏవో వినయ్ కుమార్ రైతులు పాల్గొన్నారు.

## సమన్వయంతో

ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సభా వేదిక నిర్మాణం, హెలిప్యాడ్ ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ప్రజల కూర్చునే ఏర్పాట్లు, ప్రవేశ మరియు నిష్క్రమణ మార్గాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ప్రోటోకాల్ ఏర్పాట్లు నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. అలాగే సభకు హాజరయ్యే రైతులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీటి సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్య నిర్వహణ, తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, భద్రతా బందోబస్తు వంటి అంశాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని సభా ప్రాంగణం వద్ద మరియు ప్రధాన రహదారులపై ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, ప్రజల రాకపోకలు సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భద్రతా పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమగ్ర బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఎండి వరుణ్ రెడ్డి, రవాణా శాఖ కమిషనర్ డా. కె. ఇలంబర్తి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.